క్లుప్తంగా

ఘనంగా అన్నసమారాధన



గొల్లపాలెంలోక్ష అమ్మవారి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో సోమవారం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని కాకినాడ, కోటిపల్లి రహదారిలో కనకదుర్గమ్మ ఆలయ వద్ద ఇటీవల దేవినవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో అమ్మవారికి వచ్చిన విరాళాలకు తోడు పలువురి దాతల సహకారంతో ఈ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు అంగర కృష్ణ, అంగర శ్రీను, ర్యాలి కృష్ణ, ఆకుల పండు తదితరులు తెలిపారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు రెండు వేల మంది భక్తులు ఈ అన్నసమారాధన కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు.

6వ తేదీ వరకూ ఎమ్మెల్సీ ఓటు నమోదుకు గడువు

మండపేట: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు డిగ్రీ అర్హత కలిగిన వారందరూ నవంబర్ 6వ తేదీ లోగా ఓటర్లుగా నమోదు కావాలని మండపేట తహసీల్దారు తేజేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 2021 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తయిన వారంతా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో ఓటు హక్కు పొందవచ్చన్నారు. ఓటు హక్కు కోసం ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓటు నమోదుకు ఫారం -18, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు గుర్తింపు కార్డు, నివాస ధ్రువ పత్రం ఉండాలన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, రెవెన్యూ, కాకినాడ కార్యాలయం, తహసీల్దార్, మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాల్లో ఎక్కడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్ 1950 కాల్ చేసి తెలుసుకోవచ్చన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



వల్లూరులో దరఖాస్తులను స్వీకరిస్తున్న తహసీల్దార్

కపిలేశ్వరపురం: రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రామసభలను నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ చిన్నారావు అన్నారు. మండలంలోని వల్లూరులో సోమవారం భూముల రీసర్వే గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ దాసి మీనాకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో భూ యాజమానులు తమ సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. నిర్దేశించిన గడువులోగా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ చిన్నారావు తెలిపారు.


వైఎస్సార్ సీపీ నేత శ్రీనుకు పితృ వియోగం



సత్తిరాజు (ఫైల్)

మండపేట: వైఎస్సార్ సీపీ పట్టణ శాఖ కోశాధికారి, పార్టీ సీనియర్ నాయకుడు అధికారి శ్రీనివాస్ తండ్రి సత్తిరాజు (81) సోమవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. రైతుగా పశు పోషకుడిగా సత్తిరాజుకు మంచి పేరుంది. ఆయన మృతికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ సంతాపం తెలిపారు. షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కాపు నాయకులు జిన్నూరి సత్య సాయిబాబా, మెండు బాపిరాజు, శిరంగు ఈశ్వరరావు, యాళ్ల శ్రీనివాస్, వుంగరాల రాంబాబు తదితరులు సంతాపాన్ని తెలిపిన వారిలో ఉన్నారు.

సినిమాలు



అంగర

శ్రీభీమేశ్వర	:	వేట్టయన్
శ్రీవెంకటపద్మావతి	:	విశ్వం

రైతుల గుండెల్లో గుబులు

- అండమాన్ కేంద్రంగా మరో అల్పపీడనం
- కష్టంగా మారిన ఖరీఫ్ సాగు
- వరుస వర్షాలతో ఆది నుంచీ నష్టమే
- అందని రాష్ట్ర ప్రభుత్వ సాయం



కపిలేశ్వరపురం: అన్నదాత అంటూ అందరి నోటా కీర్తినందుకునే రైతు ఖరీఫ్ సీజన్‌లో అష్టకష్టాలు పడుతున్నాడు. వరినారు మడులు వేసిన నాటి నుంచి గింజ పాలుపోసుకునే వరకూ అధిక వర్షాలు, అల్ప పీడనాలు పీడిస్తూనే ఉన్నాయి. ఈ నెల 20న ఆరంభమైన ఉపరితల ఆవర్తనం అల్పపీడనంగా ఏర్పడుతుంది. ఈ మేరకు వాతావరణ శాఖ నుంచి నిర్ధారణ అయిన నేపథ్యంలో రైతులు ఆందోళనలో ఉన్నారు. మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోని వరి చేలు మరో 15 రోజుల్లో కోతకు రానున్నాయి.

తొలి నుంచి నేటి వరకూ...

వరినాట్లు వేసిన జులైలో ఏకధాటి వర్షాలు జోరుగా పడ్డాయి. ఈశాన్య రుతుపవనాల కారణంగా జూలై, ఆగస్టుల్లో వరుసగా వర్షాలు కురిశాయి. దాంతో నారుమడులు దెబ్బతిన్నాయి. సెప్టెంబర్ మొదటి వారంలో కురిసిన వర్షాలు రైతులకు లాభిస్తాయనుకున్నప్పటికీ చేను ఎదుగుదలకు ఎరువులు వేసేందుకు ఇబ్బందులు ఎదురయ్యాయి. మరో 15 రోజుల్లో పంట చేతికందొస్తుందని అనుకుంటుండగా ఈ నెల 20న అండమాన్ కేంద్రంగా ఉపరితల ఆవర్తనం ఆరంభమైంది. అల్పపీడనంగా మారనుండడంతో రైతులు తీవ్రమైన ఆందోళన చెందుతున్నారు.

గిట్టుబాటు ధర ఇలా...

స్వర్ణ రకం క్వింటాలు బస్తాకు రూ.2300 గిట్టుబాటు ధరగా చెల్లించనుంది. సూపర్‌ఫైన్ క్వింటాలు ధర రూ.2320గా నిర్ధారించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో సొమ్ము చెల్లిస్తామంటూ ప్రభుత్వం వ్యవసాయ అధికారులతో ప్రచారం చేయిస్తుంది.

కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేనా?

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ధాన్యం కొనుగోళ్లు పారదర్శకంగా జరిగాయి. అప్పటి ప్రభుత్వ విధానం అమలులో నెలకొన్న బాలారిష్టాలను అప్పటి ప్రతిపక్షాలు పెద్దవిగా చూపి ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు వల్ల రైసుమిల్లు యాజమాన్యం, దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు జరుగుతుందన్న పారదర్శక అంశానికి వక్రభాష్యం ప్రచారం చేశారు. కారణమేమైనా కూటమి ప్రభుత్వం వచ్చింది. నచ్చిన రైసుమిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చన్న పేరుతో లోపభూయిష్టమైన విధానానికి తలుపులు తెరిచింది. రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ధాన్యం అమ్ముకోవచ్చన్న విషయాన్ని చెప్పినప్పటికీ ఆ విషయంలో తగిన చర్యలు కానరావడం లేదు. నూతన విధానం వల్ల దళారుల ప్రమేయం మరోసారి తలెత్తుతుందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు.

కానరాని ప్రభుత్వ సాయం

కూటమి ప్రభుత్వం వచ్చాక తొలిసారిగా ధాన్యం కొనుగోలు జరుగుతుంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సాగిన ఖరీఫ్ సాగు ఆది నుంచీ కష్టాలతోనే సాగింది. ప్రకృతి విపత్తులతో రైతు సతమతమయ్యాడు. దానికి తోడు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయమంటూ ఏదీ అందలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా, పంట ఆరంభ సమయంలోనే పెట్టుబడి సాయాన్ని రైతు ఖాతాకు జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక కేంద్ర ప్రభుత్వం రూ.2 వేలు చొప్పున అందజేసిన సాయం మినహా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సాయమందలేదు. ఎన్నికల సమయంలో రైతు కుటుంబానికి రూ.20 వేలు అందిస్తామంటూ హామీ ఇచ్చినప్పటికీ ఆచరణలో సాయం అందించలేదు.

కౌలు రైతుకూ దిక్కులేదు...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్రమం తప్పకుండా కౌలు కార్డులను మంజూరు చేసేది. కూటమి ప్రభుత్వం వస్తే నూతన కౌలు చట్టాన్ని తీసుకొస్తానంటూ కూటమి నేతలు హామీ ఇచ్చారు. 150 రోజులు అవుతున్నా కౌలు రైతు ప్రయోజనాలపై ఎలాంటి ప్రకటనా చేయలేదు. అనేక సార్లు కేబినెట్ సమావేశాలు జరిగినా, ఖరీఫ్ సాగు కాలం ముగియబోతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి మాత్రం కౌలు చట్టం కానీ, కౌలు కార్డుల మంజూరు విషయం కానీ ప్రస్తావించలేదు.

రెండు నియోజకవర్గాల్లో వరి సాగు ఇలా...

మండలం	పలు పంటల సాగు (ఎకరాల్లో)
మండపేట	18,005
రాయవరం	14,454
కపిలేశ్వరపురం	17,541
రామచంద్రపురం	18,299
కాజులూరు	18,092
కె.గంగవరం	17,113
మొత్తం	1,03,504

'తోరాటి' త్యాగం స్ఫూర్తిదాయకం

అంగరలో 73వ వర్ధంతి సభ



అంగరలో తోరాటి స్మారక సమావేశంలో మాట్లాడుతున్న మల్లికార్జునుడు

కపిలేశ్వరపురం: స్వాతంత్ర్యానంతరం తెలంగాణలో సాగిన రైతాంగ సాయుధ పోరాటంలో వీర మరణం పొందిన కపిలేశ్వరపురం మండలంలోని అంగరకు చెందిన తోరాటి లక్ష్మణమూర్తి ప్రాణ త్యాగం స్ఫూర్తిదాయకమని ఆయన 73వ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల ప్రజలు సోమవారం తోరాటి వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. అంగరలోని కామ్రేడ్ తోరాటి లక్ష్మణమూర్తి విజ్ఞాన కేంద్రం వద్ద స్మారక స్తూపానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పసలపూడి కృష్ణ, ముత్తా త్రిమూర్తులు, యానాల వీర్రాఘవులు, ప్రసాద్, సుంకర సత్యనారాయణ, యానాల సుబ్బారావు, తాపీమేస్త్రిల సంఘం నాయకులు నివాళి అర్పించారు. అనంతరం గ్రామంలో నిర్వహించిన స్మారక సమావేశంలో మండలంలోని పలు ప్రజా సంఘాల కార్యకర్తలు పాల్గొన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు కె.కృష్ణవేణి, ఉద్యోగుల సంఘం నాయకులు జిత్తుక మల్లికార్జునుడు, సామాజిక కార్యకర్త పెద్దింశెట్టి లెనిన్‌బాబు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ పోరాటంలో లక్ష్మణమూర్తి పాల్గొనగా అక్కడి పోలీసులు కాల్చి చంపారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రపురం-ఇచ్ఛాపురం బస్సుల ప్రారంభం



జెండా ఊపి నూతన బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ బస్ డిపో నుంచి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వరకు నడిపే సర్వీసులకు పాత బస్సుల స్థానంలో మూడు నూతన అల్ట్రా డీలక్స్ బస్సులను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల సౌకర్యం కోసం నూతన బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రామచంద్రపురం నుంచి భద్రాచలంకి ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రజల నుంచి అర్జీలు వస్తున్నాయన్నారు. దీనిపై ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కొత్త సర్వీసులు ప్రారంభించేలా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా రామచంద్రపురం పట్టణానికి వచ్చి చదువుకుంటున్న పరిసర గ్రామాల విద్యార్థులకు అనుకూలంగా ఉండేలా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు, విజిలెన్స్ అధికారి రామారావు, ఏఎంఎఫ్ రవిబాబు, ఆర్టీసీ యూనియన్ల నాయకులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై తెగుళ్ల విజృంభణ

కాజులూరు: వరి పంటపై తెగుళ్ల విజృంభణకు ఇదే అనుకూలమైన సమయమని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మండలంలోని చేదువాడలో సోమవారం ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుతం డెల్టాలోని వరి పొలాలు స్థితిగతులు, వాటికి సోకే తెగుళ్లపై పలు సూచనలు చేశారు. మండల గ్రామాల్లోని వరి పొలాలు చిరుపొట్ట దశ నుంచి ఈనిక దశలో ఉన్నాయన్నారు. ఈ దశలోనే మాగుడు తెగులు, దోమ, ఆకునల్లి, ఆకుముడత వంటి తెగుళ్లు ఎక్కువగా వ్యాపిస్తాయన్నారు. రైతులు తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే వ్యవసాయాధికారులను సంప్రదించి తగు నివారణ చార్యలు తీసుకోవాలన్నారు.

ఆరోగ్య కేంద్రం వద్దే అనారోగ్యకర వాతావరణం



ద్రాక్షారామ పీహెచ్‌సీ వద్ద రోడ్డుపై చేరిన మురుగునీరు

రామచంద్రపురం రూరల్: మండలంలోనే మేజర్ పంచాయతీగా ఉన్న ద్రాక్షారామలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిత్యం అనారోగ్యకర వాతావరణం ఉంటోంది. ఇక్కడ రోడ్డు పల్లంగా ఉండటంతో తరచుగా పక్కనున్న డ్రైనేజీ నుంచి మురుగు నీరు పీహెచ్‌సీ ఎదురుగా రోడ్డు మీదకు చేరి 10 నుంచి 15 రోజుల వరకు నిల్వ ఉండిపోతోంది. ఈ ఆరోగ్య కేంద్రానికి ప్రతి రోజూ ద్రాక్షారామ, దాదాపు 20 పరిసర గ్రామాల నుంచి నిత్యం 100 మంది వరకు పేషెంట్లు వస్తుంటారు. సీజనల్ వ్యాధుల రోజుల్లో అయితే 200 మంది వరకు ప్రతి రోజూ వస్తుంటారు. దీంతో ఆసుపత్రికి వచ్చే వారితో పాటు స్థానికులు, నిత్యం ఈ రోడ్డు గుండా వెళ్లేవారు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పలు మార్లు స్థానికులు పంచాయతీ దృష్టికి తీసుకుని వెళ్లినా పక్కనున్న డ్రైన్ శుభ్రం చేసి మురుగు చేరిన చోట బ్లీచింగ్ చల్లి మమ అనిపిస్తున్నారు తప్ప సమస్య తిరిగి ఉత్పన్నం కాకుండా శాశ్వత పరిష్కారం చేయాలని స్థానికులు ప్రజాప్రతినిధులు, అధికారులను కోరుతున్నారు.

పోలీసు అమరవీరులకు నివాళి



మండపేట రూరల్ స్టేషన్లో పోలీసు అమర వీరులకు నివాళి



మండపేట కలువపువ్వు సెంటర్‌లో నివాళి అర్పిస్తున్న టౌన్ ఎస్‌ఐ శాస్త్రి, సిబ్బంది, విద్యార్థులు

మండపేట: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు స్మరణీయం అని రూరల్ సీఐ పీతల దొరరాజు అన్నారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట టౌన్, రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలో సోమవారం పోలీసు అమర వీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రూరల్ సీఐ దొరరాజు ఆధ్వర్యంలో టౌన్ ఎస్‌ఐ హరికోటి శాస్త్రి, రూరల్ ఎస్‌ఐ డి.సురేష్‌బాబులు సిబ్బందితో కలసి పోలీసు అమర వీరులకు నివాళి అర్పించారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో భారీ ర్యాలీలు నిర్వహించారు. పోలీసు అమరవీరుల ఫ్లెక్సీలు పట్టుకుని విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఇప్పనపాడు స్టేషన్ నుంచి తాపేశ్వరం వరకూ రూరల్ పోలీసుల ర్యాలీ జరిగితే, మండపేట పట్టణంలో ఎస్‌ఐ శాస్త్రి నేతృత్వంలో కలువ పువ్వు సెంటర్లో మానవహారం నిర్వహించారు. పోలీసు అమర వీరులకు విద్యార్థులు జోహార్లు పలికారు. రెండు స్టేషన్ల వద్ద అమర వీరుల ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టౌన్ ఏఎస్‌ఐ చిన్నారావు, బ్లూ కోట్ కానిస్టేబుల్ ముని, కానిస్టేబుళ్లు సతీష్, పి.నారాయణ, ఈశ్వర్, రాము, హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, మహిళా పోలీసులు దుర్గాదేవి, సూర్యకుమారి, రూరల్ కానిస్టేబుళ్లు కుమారస్వామి, వై రామకృష్ణ, హెడ్ కానిస్టేబుల్ ఎస్.నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



ద్రాక్షారామ పోలీస్‌స్టేషన్ వద్ద అమరవీరులకు నివాళి అర్పిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని పోలీస్ అమరవీరులకు ఘన నివాళి అర్పించారు. ఎస్సై లక్ష్మణ్ మాట్లాడుతూ అపాయం ఉందని తెలిసినా తమ ప్రాణాలను పణంగా పెట్టి విధి నిర్వహణలో ముందడుగు వేసిన అమరవీరుల సేవలను వెలకట్టలేమన్నారు. వారి స్ఫూర్తిగా ప్రజలకు సేవలందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్సై ఎన్.సత్య భుజంగరావు, హెడ్ కానిస్టేబుల్ ఎం.వెంకటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్ వాసిరెడ్డి జానకిరామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఆధార్ నమోదుకు కేంద్రాలు

మండపేట: రాష్ట్ర ప్రభుత్వాదేశాల మేరకు మంగళవారం నుంచి పట్టణంలో ఆధార్ నమోదు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు సోమవారం తెలిపారు. ఈ నెల 25 వరకూ ఈ ఆధార్ ప్రత్యేక కేంద్రాలు పని చేస్తాయన్నారు. తొలిరోజు మరుసటి రోజు కూడా ఆలమూరు రోడ్డులోని విజ్ఞాన్ జూనియర్ కాలేజీ ఆవరణలో ఈ కేంద్రం నడుస్తుందన్నారు. 24న న్యూ కాలనీలోని అంగన్‌వాడీ స్కూల్లోను, 25న గాంధీనగర్‌లోని 13వ సచివాలయంలోనూ ఆధార్ సేవలు కొనసాగుతాయని వివరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి 5 ఏళ్ల లోపు పిల్లల వరకూ ఉచితంగా ఆధార్ కార్డులు ఇస్తామన్నారు. ఐదేళ్ల పైబడిన పిల్లలు తప్పని సరిగా ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఆధార్ కార్డులు పొంది, పదేళ్ల పైబడిన పెద్దలకు కూడా ఈకేవైసీ చేయించుకోవాలని స్పష్టం చేశారు. పేర్లలో మార్పులు చేర్పులు, చిరునామా మార్పులు, ఆధార్‌కు ఫోన్ నంబర్లు యాడింగ్ వంటి సేవలు కూడా పొందవచ్చన్నారు.

మండపేట మండలంలో..

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఆధార్ నమోదుకు మంగళవారం నుంచి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీడీవో కె. సత్యనారాయణమూర్తి సోమవారం తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆధార్ నమోదు చేసుకోవాలన్నారు. మారేడుబాకలోని ఎంపీఎస్ కాలేజీలో, ఏడిద, ఏడిద సీతానగరం, తాపేశ్వరం, మెర్నిపాడు, పాలతోడు, జెడ్.మేడపాడు, ఇప్పనపాడు, ద్వారపూడి, కేశవరం, వెలగతోడు గ్రామాల సచివాలయాల వద్ద ఆధార్ నమోదుకేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. మంగళవారం నుంచి ఈ నెల 25 వరకూ ఆయా కేంద్రాల వద్దకు వెళ్లి ఆధార్ సేవలు పొందవచ్చని సత్యనారాయణమూర్తి సూచించారు.

కపిలేశ్వరపురం: మండలంలోని తాతపూడి, కోరుమిల్లి, వడ్లమూరు గ్రామాల్లో మంగళవారం ఆధార్ నవీకరణ శిబిరాలు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ కె.రత్నకుమార్ సోమవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని సచివాలయాల్లో నిర్వహించే శిబిరాల్లో రెండు రోజులు పాటు చిన్నారుల వేలిముద్రలను నవీకరిస్తారన్నారు.

కపిలేశ్వరపురం మండలం కార్యదర్శులు

కపిలేశ్వరపురం-1	కె.శివచక్రవర్తి	9948970046
కపిలేశ్వరపురం-2	కె.పండు	9441818405
తాతపూడి	బ్రహ్మాజీరావు	9381725156
అంగర-1	ఆర్‌ఎంవీవీఎస్ ఈశ్వరరావు	9618861999
అంగర-2	మహమ్మద్ అలీ షేక్	9652244131
పడమర ఖండ్రిక	పి.సత్తిబాబు	9676273393
వెదురుమూడి	వై. శారద	8790515028
వల్లూరు	కె.సత్తిబాబు	9959545391
నేలటూరు	పి.మోహన్	8008707882
నిడసనమెట్ట	జి.విజయ్‌కుమార్	9550096513
వడ్లమూరు	పి.వెంకటేశులు	8919435971
నల్లూరు	పి.రమేష్	9618988149
కాలేరు	యు.సుప్రియ	7981281398
అచ్యుతాపురం	జి.దేవీప్రసన్న	550124927
టేకి	కె.రామకృష్ణ	9951480999
టేకి	ఎస్.శ్రీనివాసు	8978306474
కేదారిలంక	కె.యశ్వంత్‌కుమార్	7780276777
మాచర	జి.చినబాబు	99853 84544
కోరుమిల్లి-1	ఆర్‌ఎస్‌వీ కామేశ్వరరావు	908852108
కోరుమిల్లి-2	కె.శంకరమూర్తి	9502121667
నాగులచెరువు	కె.యశ్వంత్‌కుమార్	7780276777
వాకతిప్ప	పి.వెంకటేశులు	8919435971
అద్దంకివారిలంక	జి.చినబాబు	9985384544

ఆర్టీసీ కొరియర్‌లో అదనపు బాదుడు



రూ.60కు ఇచ్చిన బిల్లు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపోలోని ఆర్టీసీ కొరియర్ సర్వీస్ కార్యాలయంలో అదనపు వసూళ్ల పర్వం కొనసాగుతోంది. కస్టమర్ల నుంచి బిల్లు కంటే అదనంగా రూ.10 నుంచి రూ.50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారుల గగ్గోలు పెడుతున్నారు. ఆదివారం ఒక వినియోగదారుడు వెల్ల కామెర్ల మందును చిన్న కవరులో పెట్టి పార్శిల్ చేయగా అతని వద్ద రూ.70 వసూలు చేశారు. బిల్లు మాత్రం రూ.60 లకే ఇవ్వడంతో అదేంటని ప్రశ్నించిన అతనికి బస్సు డ్రైవర్‌కి ఇవ్వాలన్న సమాధానం వచ్చింది. దీనిపై డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావును వివరణ కోరగా బిల్లు కంటే అదనంగా వసూలు చేయడానికి లేదని, ఎవరైనా అలా వసూలు చేస్తే తమ దృష్టికి తీసుకుని రావాలని తెలిపారు.

పేద పాస్టర్లకు అండగా ఉంటాం



పాస్టర్ల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న డేనియల్ పాల్

- పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు డేనియల్ పాల్
- తాపేశ్వరంలో జిల్లాస్థాయి సమావేశం

మండపేట: జిల్లాలోని పేద పాస్టర్లందరికీ తాము అండగా ఉంటామని పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు రెవరెండ్ బిషప్ డాక్టర్ డేనియల్ పాల్ అన్నారు. పాస్టర్స్ ఫెలోషిప్ జిల్లా కమిటీ సర్వసభ్య సమావేశం సోమవారం తాపేశ్వరంలోని జీసస్ క్రైస్ట్ గ్లోరీ చర్చిలో జరిగింది. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పాస్టర్లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా డేనియల్ పాల్ మాట్లాడుతూ పేద పాస్టర్ల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. గతంలో పాస్టర్ల సంక్షేమానికి రూ.12 లక్షలు వెచ్చించినట్టు తెలిపారు. ఈ ఏడాది కూడా ప్రతి పాస్టర్‌కు క్రిస్మస్ ఖర్చుల నిమిత్తం రూ.10 వేల వంతున అందిస్తామని ప్రకటించారు. ఇటీవల మృతి చెందిన ఫెలోషిప్ సభ్యుని భార్యకు రూ.10 వేల ఆర్థిక సాయం అందించి డేనియల్‌పాల్ ఆ కుటుంబానికి అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ఫెలోషిప్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ సీహెచ్ ధనరాజ్, కోశాధికారి శామ్యూల్ జ్యోతి, కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.ప్రభుకుమార్, అదనపు కార్యదర్శి సుందర్ విజయం తదితరులు పాల్గొన్నారు.